www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
ఆదివారం 09 మార్చి 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రెయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003





# మీ అన్నగా బాధ్యత నాది

## మా సర్కారు బలం మహిళలే.. సీఎం రేవంత్ రెడ్డి

- పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 'ఇందిరా మహిళా శక్తి' సభ
- కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- అప్పుడే ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం
- త్వరలో మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, గోదాములు..
- సంఘాల ఉత్పత్తులకు పన్ను మినహాయింపు
- మహిళల అభివృద్ధికి సోలార్ ప్లాంట్లు, బస్సులు
- అంబానీ, అదానీకి దీటుగామన ఆడబిడ్డలు ఎదగాలి
- ఎన్నికల్లో పోటీ చేయండి.. గెలిపించుకుంటాం
- పదేండ్ల చంద్రగ్రహణం తొలగింది
- టన్నెల్ కూలితే, పంటలు ఎండితే బీఆర్ఎస్ నేతలకు పైశాచికానందం
- అలాంటి వాళ్లు బాగుపడిన చరిత్ర ఎక్కడా లేదు


3లో

## మహిళలు వ్యాపారంలో అదానీ,అంబానీలతో పోటీపడాలి

మహిళలు వ్యాపారంలో అదానీ,అంబానీలతో పోటీపడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన కార్యచరణను ప్రజా ప్రభుత్వం రూపొందిస్తోందని వెల్లడించారు. శనివారం కోఠిలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.500 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుందన్న సీఎం.. అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన యూనివర్సిటీకి రూ.500 కోట్ల నిధులు కేటాయించామన్నారు. అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీ పడాలని ఆ విశ్వవిద్యాలయ విద్యార్థినులకు సూచించారు. మహిళలకు చదువు చాలా ముఖ్యమని బాగా చదువుకొని యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










- అధికారులు, అధికార పార్టీ మాజీ కౌన్సిలర్, కార్యకర్త కుమ్మక్కు..
- టెండర్లలో అక్రమాలు..
- పుష్కలంగా ఆ అధికారి అండదండలు..

# మరమ్మత్తుల టెండర్లలో అవినీతి

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :**

నాగర్ కర్నూల్ జిల్లా.. పారదర్శకంగా నిర్వహించాల్సిన మున్సిపల్ నిధుల ద్వారా నిర్వహించే కాంట్రాక్టులు అవినీతిపరులకు కాసుల పంటగా మారింది. వివిధ ప్రకటనలతో పాటు విస్తృత ప్రచారం కల్పించిన తర్వాత మున్సిపల్ నిధుల ద్వారా మంజూరైన పనులకు టెండర్లను ఆహ్వానించి కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఒకటో వార్డుకు చెందిన కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్, కార్యకర్తకు అధికారి అండదండతో సుమారు రూ.1,25,00,000 పైన పనులకు మరమ్మత్తుల కాంట్రాక్టులు అప్పగించడం గమనార్హం. ఇతరులు టెండర్లు వేస్తే బిల్లులు రాకుండా అడ్డుకుంటూ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న అధికారి, పలువురు సిబ్బంది చేస్తున్న నిర్వాకం వల్ల టెండర్లు వేయాలంటేనే భయం నెలకొంది. కానీ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త చేసే పనులకు మాత్రం బిల్లులను వెంటనే చెల్లిస్తూ ప్రోత్సహించడం వెనుక మర్మమేంటని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## కోట్ల రూపాయల ప్రజాధనం వృథా..

కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సద్వినియోగం చేయాల్సిన మున్సిపల్ అధికారులు దుర్వినియోగం అయ్యేలా ఆ ఒకరికే కాంట్రాక్టు అప్పగిస్తూ భారీగా ముడుపులు తీసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పలు బోర్ల రిపేరు, దసరా లైటింగ్, ట్యాంకులు, డ్రైనేజ్ టెండరు, సెంట్రల్ లైటింగ్, ఇలా చాలా పనులకు అంచనా వ్యయాన్ని పెంచి అక్రమంగా ఇసుకను కూడా డంపు చేసి ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. టెండర్లు గడువు సమయం సమీపిస్తున్న ప్రచారం చేయకుండా ఒకటి రెండు రోజుల్లోనే టెండర్ ప్రక్రియను ముగించి కొంతమంది అధికారులతో ఇక్కడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఏఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

## ఎమ్మెల్యే అభాసుపాలు..

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి రూ.వందలాది కోట్ల నిధులను రహదారుల నిర్మాణానికి మంజూరు చేయించగా కాంట్రాక్టుల విషయం కూడా ఆయన దృష్టికి రాకపోవడం దురదృష్టకరమని పలువురు నేతలు వాపోయారు. అధికార పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కమిషనర్ కూడా వత్తాసు పలుకుతూ వారి అండదండలతోనే ప్రైవేట్ టెండర్లు వేసి కమిషన్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కల్వకుర్తిలో పనిచేసిన సందర్భంలో కూడా అధికారిపై పలు విమర్శలు ఉన్నట్లు తెలిసింది. మున్సిపల్ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు మంజూరైన కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని టెండర్లలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీయాలని సాధారణ ప్రజలు కోరుతున్నారు. పలు కాంట్రాక్ట్ పనులు చేస్తున్న మున్సిపల్ అధికారులు కూడా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలుస్తుంది.





# పన్నులు సకాలంలో చెల్లించాలి

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలపై జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అత్యధిక బకాయిలు ఉన్న వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఆస్తి పన్ను బకాయిల వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీల్లో రూ.1355.07 లక్షలు ఎరియర్స్, రూ.572.53 లక్షలు ప్రస్తుత బకాయి: రూ.782.54 లక్షలు ఇప్పటివరకు వసూలైన మొత్తం: రూ699.80 లక్షలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని, అందరూ తమ ఆస్తి పన్నులను, ఇతర మున్సిపల్ పన్నులను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, ఇంకా చెల్లించని వారి ఆస్తులను పురపాలక సంఘ చట్టం - 2019 ప్రకారం సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. ఈ తనిఖీ సమయంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, రెవెన్యూ ఆఫీసర్ కనకయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపాల్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



# మీ అన్నగా బాధ్యత నాది

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ సర్కారు బలం మహిళలేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమన్నారు. అప్పుడే తాము అనుకున్న ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ రాష్ట్రం రూపొందుతుందని తెలిపారు. 'మీ అన్నగా మిమ్మల్ని కోటీశ్వరులను చేసే బాధ్యత నేను తీసుకుంటా.. మీరు వ్యాపారం చేస్తామంటే కావాల్సిన పెట్టుబడులు, భూములు మేమిప్పిస్తాం.. కార్పొరేట్ కంపెనీలకు దీటుగా, అంబానీ, అదానీకి పోటీగా ఎదగాలి' అని ఆయన పిలుపునిచ్చారు. మహిళలను వ్యాపారవేత్తలను చేసేందుకు సోలార్ ప్లాంట్లు పెట్టిస్తున్నామని, ఆర్టీసీ బస్సులకు యజమానులను చేస్తున్నామని, ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు ఏర్పాటు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు. ఐకేపీ కేంద్రాల్లో మహిళా సంఘాలు కొనుగోలు చేసే వడ్లను ఆ గోదాముల్లో నిల్వ చేయడంతో పాటు వాటిని మిల్లింగ్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను కూడా మహిళా సంఘాలకే అప్పగిస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో 'ఇందిరా మహిళా శక్తి' పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'మహిళా దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో మా ఆడబిడ్డలు రాణీరుద్రమ, చాకలి ఐలమ్మ, సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో మహిళా శక్తిని చాటారు. రాష్ట్ర రాజధానిలో ఆడబిడ్డలు తమ ఆత్మగౌరాన్ని చాటుతున్నారు. రాష్ట్రానికి పదేండ్లు పట్టిన చంద్ర గ్రహణం తొలగిపోయింది. మా ఆడబిడ్డలు ఇవాళ వెలుగులు చూస్తున్నారు.. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగమిస్తుంది.. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వన్ ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది' అని పేర్కొన్నారు. మిల్లర్లు పందికొక్కుల్లా కాజేస్తున్నారని, వాటిని తిరిగి ఇవ్వడం లేదని, లెక్కలు చెప్పడం లేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇక ఈ పరిస్థితిని మార్చాలన్నారు. ప్రతి మండలంలో మహిళా సంఘాలతో రైస్ మిల్లులు, గోదాముల నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం తరపున ప్రోత్సహిస్తామని, ప్రభుత్వమే స్థలం ఇవ్వడంతో పాటు రైస్ మిల్లులు, గోదాముల నిర్మాణాలకు అవసరమైన రుణాలు ఇప్పిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాల కాలేజీల్లో విద్యార్థులకు పౌష్టికాహారం మహిళా సంఘాల నుంచి సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించి విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెర్ప్ సీఈవోను ఆయన ఆదేశించారు.

**మహిళా సంఘాల ఉత్పత్తులకు పన్నుల మినహాయింపు**

గతంలో ఐకేపీ సెంటర్లను నిర్వహించే మహిళలకు కమీషన్ డబ్బులు ఎన్నేండ్లకు ఇస్తారో తెలిసేది కాదని, తాము వెంటనే చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు పన్నుల మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు నిర్వహించి విద్యుత్ శాఖకు అమ్మేలా చేశామని తెలిపారు. 'కేసీఆర్ బంధువులు, పెట్టుబడిదారులకే పరిమితమైన ఆర్టీసీ బస్సుల లీజులను మా బంధువులుగా భావించే మహిళా సంఘాల్లోని మహిళలకు అప్పగించాం. మహిళా దినోత్సవం రోజు 150 బస్సులు ప్రారంభించుకున్నాం' అని సీఎం అన్నారు..

**టన్నెల్ కూలితే బీఆర్ఎస్ కు పైశాచికానందం**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలినా, రోడ్డుపై ప్రమాదం జరిగి మనుషులు చనిపోయినా.. ఎండలతో పంటలు ఎండినా బీఆర్ఎస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని, సంబురాలు చేసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పదేండ్లు అధికారంలో ఉన్న వారికి పది నెలల పాలనపై ఏడుపు ఎందుకు? పదేండ్లు పాలనలో ఉన్న వారు తమ అనుభవాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలి.. సూచనలు చేయాలి. పైశాచికానందం ఉన్నోళ్లు బాగుపడిన చరిత్ర ఎక్కడ లేదు. ఏడుపులు ఆపి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని బీఆర్ఎస్ నేతలకు సూచించారు.

**చట్టసభల్లో 33 శాతం మహిళలు**

కేసీఆర్ తొలి ఐదేండ్ల పాలనలో మంత్రివర్గంలో మహిళలను తీసుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 'ఇప్పుడు మంత్రులుగా ఉన్న కొండా సురేఖ, సీతక్క మహిళల తరపున నిలబడి కొట్లాడుతున్నారని, మహిళల పక్షాన మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో మంత్రులుగా సురేఖ, సీతక్క ఉన్నారన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మేయర్, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, సర్పంచ్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా ఆడబిడ్డలు ఉన్నారు. నైపుణ్యం పెంచుకుంటే భవిష్యత్ చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం ఇస్తాం. రాబోయే ఎన్నికల్లో 33 శాతం మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కాబోతున్నారు. వారిని గెలిపించే బాధ్యత నాది.. నాయకత్వ లక్షణాలు పెంచుకోండి' అని పిలుపునిచ్చారు.





## పదేండ్ల చంద్రగ్రహణం పోయింది

తెలంగాణలో మహిళా సంఘాలకు, ఆడబిడ్డలకు పదేండ్ల చంద్ర గ్రహణం తొలగిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్లు స్వయం సహాయక సంఘాల మహిళలు మండల కేంద్రాలకు వెళ్లే అవకాశం ఉండేది కాదని చెప్పారు. 'ఆడబిడ్డలు నిర్ణయం తీసుకొని ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆశీర్వదించడంతో 15 నెలల కింద ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఇప్పుడు ఆడబిడ్డలు తలెత్తుకొని వెలుగు, స్వేచ్ఛను చూస్తున్నరు. సంఘాలు బలోపేతమైనప్పుడే తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుంది. మా సర్కారు వెనుక మహిళా సంఘాలు ఉన్నాయన్న ధీమాతోనే రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెప్తున్నం' అని ఆయన వివరించారు.











## మహిళలపై వివక్ష తొలగాలి

### పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే లక్ష్మి

**కలంజ్యోతి, నిర్మల్ :** పురుషులతో పాటు మహిళలు రాణిస్తున్నా వారిపై వివక్ష తొలగటం లేదని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిఓడబ్ల్యు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ నేటికీ మహిళలపై వివక్షత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు అన్ని రకాల అత్యాచారాలకు వ్యతిరేకంగా పరువు హత్యలను ఆపాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు పిలుపునిచ్చారు. మహిళలు అణిచివేతకు వివక్షతకు గురవుతూనే ఉన్నారని సామ్రాజ్యవాద విష సంస్కృతి నానాటికి విస్తరిస్తుందని అన్నారు. స్త్రీపురుష సమానత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు గంగమణి, లక్ష్మి, తశ్రీన్,చిట్టి, లత,లలిత, విజయ,తదితరులు పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక స్థిరత్వానికి కృషి



**కలంజ్యోతి, నర్సాపూర్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చందనగర్ లోని భవ్య ఫంక్షన్ హాలో మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ సమాజం గొప్పగా అభివృద్ధి చెందుతుందన్నారు.మహిళలను గౌరవించడం అంటే మన తల్లులను మనము సన్మానించుకోవడం అన్నారు. మహిళా సంక్షేమానికి తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికస్థిరత్వానికి పెద్దపీటవేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## అన్ని రంగాల్లో పురోభివృద్ధి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మహిళలు అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నారని ఎస్సై శ్రీకాంత్ గౌడ్, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్ లో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు అక్షరాస్యులు అయినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనిధి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, రాబోయే ఐదేళ్లలో కోటి మందిని కోటీశ్వరులుగా తయారు చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ఎస్సారెస్పీ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో రూ.5 కోట్లతో చేపట్టనున్న మహిళా శక్తి భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నదని, ఇందుకోసమే మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నదని తెలిపారు.రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వీటిని ఓర్వలేకనే బిఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే కాలంలోనూ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

**మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు**

జగిత్యాల జిల్లాలో మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల సాధికారతకు కల్పించడానికి వారి జీవనోపాధి బలోపేతం చేయడానికి మహిళ శక్తి కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల బ్యాంకు రుణాలను వడ్డీ లేకుండా అనుసంధానం చేసి వివిధ రకాల మైక్రో ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు చేస్తూ ఎస్ హెచ్ జి మహిళలకు సాధికారత కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సౌకర్యాలను మహిళా సంఘాలు సద్వినియం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు, విప్ లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డీవో, మధుసూధను, డీఆర్డిఓ,రఘు వరుణ్, డి.ఎస్.పి, మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారికతోనే సమాజాభివృద్ధి

### జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** మహిళ సాధికారికతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, విధి నిర్వహణలో రాణించిన మహిళా పోలీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీమ్ రావు, డీఎస్పీలు రఘు చందర్, రాములు, మహిళా ఎస్ఐలు గీత, సుప్రియ, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, ఎస్బీ ఇన్ స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, జిల్లా పరిధిలోని వివిధ విభాగాల మహిళ కానిస్టేబుళ్లు, హోం గార్డ్స్ పాల్గొన్నారు.






## ముల్కనూర్ మహిళా డెయిరీలో మహిళలకు ఉత్తమ పురస్కారాలు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముల్కనూర్ మహిళా డెయిరీలో అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అధ్యక్షతన మహిళా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి స్థాయిలో అత్యధికంగా గేదె పాల సరఫరాలో గుజ్జేటి సరిత, రజిత, ఆవు పాల సరఫరాలో గుజ్జేటి సరిత, పోతరాజు రాజమణిలకు (202324) బహుమతులు అందజేశారు. ములుకనూరు డెయిరీ చరిత్ర, పనిచేసే విధానం, అందిస్తున్న సేవలు తెలిపే కొత్తగా తయారు చేయించిన డెయిరీ బ్రోచర్ ను అధ్యక్షులు బుర్ర ధనశ్రీ, పాలకవర్గం, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. డెయిరీ మహిళా సిబ్బంది కాశిరెడ్డి నీరజ, మిరియాల శారద, బరిగే యాదలక్ష్మి, కొట్టే వసంతకు ఉత్తమ పురస్కరాలు అందచేశారు. కార్యక్రమంలో పాలకవర్గం, మహిళా సిబ్బంది, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతకు చర్యలు

## ఎస్పీ అశోక్ కుమార్






**కలంజ్యోతి, జగిత్యాల :** మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత, భద్రత కోసం 'మై ఆటో సేఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో రిక్షాల సర్వీసెస్ వాహన యాజమాన్యం నుండి అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారాన్ని 'MY AUTO IS SAFE' యాప్ క్యూ ఆర్ కోడ్ ను కోరుట్ల పట్టణంలో ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 4000లకు పైగా ఆటోలు ఉన్నాయని ఇప్పటి వరకు 2093లకు పైగా ఆటోలకు క్యూఆర్ కోడ్ లను వేయడం జరిగిందన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన, దురుసుగా మాట్లాడిన, మరే ఇతర సమస్యలు ఎదుర్కొన్న ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ లో కనిపిస్తుందన్నారు. వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందవేయడంతో వెంటనే స్పందించి వాహనం లైవ్ లొకేషన్ కి చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఆర్టీఓ శ్రీనివాస్, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ,కోరుట్ల సీ.ఐ సురేష్ బాబు,ఎస్. ఐ లు శ్రీకాంత్, శ్యామ్ రాజ్ , నవీన్, రాంచంద్రం పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ఓనర్స్ పాల్గొన్నారు.

# చెరువుల్లో నీరు నింపండి

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** పంటలు ఎండిపోకుండా గొలుసుకట్టు చెరువుల్లో నీరు నింపేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నీటిపారుదశాఖ ఇంజినీర్లను ఆదేశించారు. మండల కేంద్రంలో ఇరిగేషన్ ఇంజినీర్లతో ఆయన శనివారం సమీక్షా నిర్వహించారు. అనంతగిరి, మిడ్ మానేరు నది నుంచి విడుదలయ్యే నీటితో ఇల్లంతకుంట, గన్నేరువరం, బెజ్జంకి మండలాల్లోని గొలుసుకట్టు చెరువులను నింపాలన్నారు. ఈ దిశగా సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పంటలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమీక్షలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, నీటిపారుదశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ వేణుబాబు, డీఈలు సీతారామరాజు, దేవేందర్, ఇల్లంతకుంట తహశీల్దార్ ఫారుఖ్ తోపాటు 10, 11 ప్యాకేజీ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ పై అవగాహన ఉండాలి

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో మిషన్ ఫస్ట్ 95 కాంపెయిన్ లో భాగంగా ముల్కనూర్ సొసైటీ ఉద్యోగులకు హైరిస్క్, ఇండెక్స్ క్లైంట్స్ కి హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. ఏ ఒక్కరికీ ఎయిడ్స్ వ్యాధి సోకకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ క్యాంపై నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సొసైటీ ఉద్యోగులు 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక వైద్యశాల డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సూపర్వైజర్ రాజయ్య, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఐసీటీసీ కౌన్సిలర్ ఆకుల మహేందర్, వైఆర్జీ కేర్ ఎల్డబ్ల్యూఎస్, సీఎల్ డబ్ల్యూ లలిత సొసైటీ సిబ్బందికి ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది క్యాంపు నిర్వహణకు సహకరించిన సొసైటీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, జనరల్ మేనేజర్ రామ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





# రహీంఖాన్ పేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని రహీంఖాన్ పేట గ్రామంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకుడు బత్తిని స్వామి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తిని సాయగౌడ్, తిప్పారపు శ్రవణ్, వజ్జేపల్లి శ్రీకాంత్, చిమ్మనగొట్టి శ్రీనివాస్, సాయిప్రసాద్ రెడ్డి, చొప్పరి వంశీ, మాజీ సర్పంచ్ బిళ్ళమీది పరుశురాం, బత్తిని నారాయణ, పూదరి మల్లయ్య, కంటం కనకయ్య పూదరి అంజయ్య, పొన్నగంటి తిరుపతి, ఏనుగుల పరశురామ్, ఏనుగుల బుచ్చయ్య, దామ అంజయ్య, ఉత్కం పరుశురాం, కత్తి వీరయ్య నార్ల శ్రీనివాస్, తోత్తుల ఎల్లయ్య, పెకసు రమేష్, ఏనుగుల మహేందర్, కుస నరేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# డీ65 కాల్వ, కల్వర్టు డ్యామేజ్

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులోని కాకతీయ కెనాల్ కి సంబంధించిన డీ 65 ఉప కాలువ ఓ చోట డ్యామేజ్ అయింది. కల్వర్టు కింద నుంచి వెళ్లిన కాలువలో పేరుకపోయిన మట్టిని మూడు రోజుల క్రితం జేసిబితో తొలగించారు. ఈ క్రమంలో కాలువతో పాటు, కల్వర్టు కూడా ధ్వంసం అయింది. ఈ విషయమై వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ చారీని వివరణ కోరగా, రైతులు తమకు తెలియకుండా జేసిబి ఉపయోగించడంతో డ్యామేజ్ అయినట్లు పేర్కొన్నారు. సోమవారం రిపేర్ చేయిస్తామని చెప్పారు.




# అంబేద్కర్ ను అవమానపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కలంజ్యోతి, మల్యాల :** సారంగాపూర్ మండలం నాగునూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహంకు చెప్పుల దండ వేసి, అవమానపరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలని శనివారం మల్యాలకు చెందిన టీం రాయల్స్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిసె గణేష్, ఉప్పరి విగ్నేష్, నివాస్, అలంకార్, అజయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం**

మండల దళిత సంఘం ఆధ్వర్యంలో మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహంకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మ్యాక లక్ష్మణ్, ఎన్. సంజీవ్, శనిగారపు తిరుపతి, తాళ్ళ హరినాథ్, నక్క అనిల్, కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ స్కీంకు కృషి చేస్తా

## ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

**కలంజ్యోతి, జగిత్యాల :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉద్యోగ ఉపాధ్యాయులకు సంక్షేమం కోసం ప్రవేశపెట్టనున్న హెల్త్ స్కీమును ప్రైవేట్ ఉపాధ్యాయులకు వర్తింపజేసే విధంగా కృషి చేస్తానని పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. జగిత్యాలలోని విద్యానగర్ రామాలయంలో శ్రీపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పీఆర్టీయూ టీఎస్ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జగిత్యాల జిల్లా శాఖ ఎమ్మెల్సీన ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి చాలా అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వుజగిరి జమున, శశికళ, జయప్రద తదితరులు పాల్గొన్నారు.







# బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో బాలల సంరక్షణ దిశగా ప్రత్యేక దృష్టి సారించి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోనున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో బాలసదనం భవనం నిర్మాణానికి డీసీపీఏ భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమసాగర్ రావు, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా రూ.1.34 కోట్లతో మిషన్ వాత్సల్య నిధులతో నూతన బాలసదనం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తప్పు నిర్ధారణ అయితే క్రమశిక్షణ చర్యలు

## జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లా కేంద్రంలోని గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నైతం శ్రీనివాస్, పీడీ ధనలక్ష్మికి సంబంధించి లైంగిక వేధింపుల కేసులో తప్పు నిర్ధారణ అయితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని లోకల్ కంప్లయింట్ కమిటీ సభ్యురాలు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం లోకల్ కంప్లయింట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు సంబంధించి కమిటీ పరిధిలో ఫిర్యాదులను తీసుకొని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నైతం శ్రీనివాస్, ధనలక్ష్మికి సంబంధించిన కేసులో లోకల్ కంప్లయింట్ కమిటీ ప్రతినిధులు వారు పని చేస్తున్న ప్రదేశాలలో ప్రాథమిక విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో నమోదు చేసిన వివరాలను సమగ్రంగా పరిశీలించి తుది చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



# కామర్స్ తో ఉజ్వల భవిష్యత్




**కలంజ్యోతి, జగిత్యాల :** కామర్స్ తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జగిత్యాల కామర్స్ ఫోరం వ్యవస్థాపకులు శ్రీపాద నరేష్, ఎస్ కేఎన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్ లో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులతో కలిసి జగిత్యాల కామర్స్ ఫోరంను ప్రారంభించారు. కామర్స్ తో విద్యార్థులకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని కామర్స్ అనేది సేవా రంగం కిందికి వస్తుందని అన్నారు.. సైన్స్ విద్యార్థులకు సైతం కామర్స్ చదవడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కామర్స్ ను హైస్కూల్ స్థాయి నుంచి ఒక సబ్జెక్టుగా పెట్టేందుకు త్వరలోనే తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ , జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, రెసిడెన్షియల్ కాలేజిల అధ్యాపకులు, కేజీబీవీ అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య సంరక్షణనే దేశ సంరక్షణ

**కలంజ్యోతి, జగిత్యాల :** మహిళలు ఆరోగ్యవంత జీవనాన్ని కొనసాగించే విధంగా సంరక్షించబడినప్పుడే దేశం సురక్షితంగా సంరక్షించబడుతుందని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సి.పద్మిని కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐఎంఏ హాల్ లో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎంఏ జగిత్యాల, జగిత్యాల గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మిని మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్ మరణాలు రోజురోజుకూ పెరుగుతున్న సందర్భంలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు క్యాన్సర్ ముక్త్ భారత్ లో భాగంగా ప్రతి ఒక్కరూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్ , ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు గూడూరి శ్రీలత, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వోడ్నాల రజిత, డాక్టర్ నాగరత్న, డాక్టర్ మోర రోజా, డాక్టర్ సుదక్షణ దేవి, డాక్టర్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.






# ఘనంగా మహిళా దినోత్సవం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల పద్మశాలి సంఘ భవనంలో ఈ రోజు బీడీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొక్కుల శాంత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిని మౌనిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మహిళా పారిశుధ్య కార్మికులకు, మహిళా వ్యవసాయ కూలీలకు టోపీలు, కర్చీఫ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు గాండ్ల జ్యోతివేణు, అంగన్వడీ టీచర్ స్వప్న, దాదాపు 50 ఉంది మహిళలు పాల్గొన్నారు.

# కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ ఓ మైలురాయి

## న్యూ జనరేషన్, ఐఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ జానకీ రాంరెడ్డి



**కలంజ్యోతి, నల్గొండ** : కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ అనేది ప్రీప్రైమరీ విద్యార్థినీ విద్యార్థుల జీవితాల్లో ఒక ఉత్తేజకరమైన మైలురాయి అని న్యూ జనరేషన్, ఐఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ జానకీ రాంరెడ్డి వెల్లడించారు. కొత్త ప్రారంభాలను జరుపుకు నేందుకు, గతం యొక్క వెచ్చని జ్ఞాపకాలతో పాటు భవిష్యత్తు కోసం పెద్ద కలలు కనడానికి దోహదపడే వేడుక అన్నారు. శనివారం న్యూ జనరేషన్, ఐఎంఎస్ విద్యా సంస్థల్లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయే షన్ డే వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జానకీ రాంరెడ్డి మాట్లా డుతూ.. ప్రతి సంవ త్సరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి, పై తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు. గ్రాడ్యుయేషన్ వేడుక లతో విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తి పెరు గుతుందని వివరించారు.



విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలు నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులతో పాటు తల్లిదండ్రులపైనా ఉందని అభిప్రాయప డ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టోపీలు..స్కోల్‌లతో అలంకరించబడి.. గ్రాడ్యుయేట్లుగా మారిన తమ పిల్లల గ్రాడ్యుయేషన్ గౌన్లు చూసిన విద్యార్ధుల తల్లిదండ్రుల ఆనందానికి అవ ధుల్లేకుండా పోయింది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయినీలు నాజీమా, లావణ్య పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

**కలంజ్యోతి, నర్సాపూర్** : నియోజకవర్గ పరిధిలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు మెదక్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆర్థికసాయం అందజేశారు. రెడ్డిపల్లికి చెందిన జోగురాములు కుటుంబానికి రూ.10వేలు, రామమ్మ కుటుంబానికి రూ.5వేలు, నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో శివంపేట మండల నాయకుడు చింత స్వామి, నాయిని దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సులోచన, నర్సింహారెడ్డి, పిల్లుట్ల గ్రామ వైస్ ప్రెసిడెంట్ పెల్లి శివకుమార్, మాజీ ప్రెసిడెంట్ బబ్బురి వెంకటేష్, మాజీ వైస్ ప్రెసిడెంట్ చింత మధు, పిల్లి స్వాములు, పిల్లి కృష్ణ, బోసు పుల్లయ్య, మోనగారి సత్యనారాయణ, డప్పు నర్సింలు, సంధ్ర సతీష్, పెద్దపులి శంకర్, కమ్మరి సురేష్, దాసరి వీరేష్, బుర్ర పోచ గౌడ్, పిల్లి మధు, దాసరి రాములు, గులేగారి రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం




**కలంజ్యోతి, భీమదేవరపల్లి** : మండలంలోని కొత్తకొండలో శనివారం మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తకొండ గ్రామానికి చెందిన దయ్యాల స్వప్న (24) ఈనెల 7 న ఇంటి నుంచి తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని చెప్పి తల్లిగారి ఇంటికి వెళ్తున్నానని భర్త సతీష్ తో చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా అక్కడి నుంచి సదరు మహిళ రాకపోవడంతో.. తన కూకటి ఓదెలుకు భర్త ఫోన్ చేసి ఆరాతీయగా వివరాలు లభ్యం కాలేదు. దాంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు ఆమె దగ్గర ఫోన్ కూడా లేదని, చామన చాయ రంగు గుండ్రటి ముఖము, గ్రీన్ సారీ కట్టుకొని వెళ్లిందని భర్త సతీష్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని కోరారు. ఈ విషయమై సతీష్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

## కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

**కలంజ్యోతి, నిర్మల్** : చాలాకాలంగా కొనసాగుతున్న కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా నిర్మల్ ప్రధాన న్యాయస్థానంలో శనివారం లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ కేసులు త్వరగా పరిష్కారం కాకుంటే సమయం, డబ్బు వృథా అవుతాయన్నారు. కేసులను పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్ లో పరిష్కరించుకుంటే మానసికంగా ప్రశాంతత చేకూరుతుందన్నారు.





## మహిళా దినోత్సవ వేడుకలు

**కలంజ్యోతి, రుద్రంగి** : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్యదర్శి బాబుతో పాటు మాజీ వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య, జక్కు మోహన్, జక్కుల లక్ష్మి నర్సయ్య తదితరులు పాల్గొని మాజీ సర్పంచ్ అల్లూరి మనసతో పాటు మహిళలను సత్కరించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్త్రీలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.



## పేదలకు, భక్తులకు అన్నదానం

**కలంజ్యోతి, వేములవాడ** : మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1,415 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున రాజన్న ఆలయం వద్ద 150 మంది పేదలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలుగా వేముల ముత్యం వర్ధంతి సందర్భంగా వీరి సతీమణి వేముల పుష్ప, కుటుంబ సభ్యులు, జువ్వాడి స్నేహాలత వెంకటేశ్వర రావు, ప్రతాప స్వప్న సంపత్, నగుబోతు రవీందర్ జ్యోతి, గణాచారి మఠం శైలజ సాంబశివు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ శరత్ చంద్ర, శిరీష సాయిచంద్ర, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని తెలిపారు. పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలను కునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.

## డంపింగ్ యార్డ్ హటావో.. నర్సాపూర్ బచావ్



**కలంజ్యోతి, నర్సాపూర్** : గత 20 రోజుల నుండి 'డంపింగ్ యార్డ్ మాకొద్దు' అంటూ నర్సాపూర్ ప్రజలు నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని డంపింగ్ యార్డ్ ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజల కోరిక మేరకు ఈ యార్డ్ ను ప్రభుత్వం ఇక్కడ నుండి తరలించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.